# క్రైస్తవులు బీఆర్ఎస్ వైపే

## తీర్మానించిన క్రైస్తవ సంఘాలు




సమావేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఖైరతాబాద్, నవంబర్ 25 : రాష్ట్రంలోని క్రైస్తవులందరూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని, క్రైస్తవ సంఘాలు స్పష్టం చేశాయి. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ క్యాథలిక్ లే మెన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్, ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సమాఖ్య అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాథలిక్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు, మాజీ బీజేపీ క్రిస్టియన్ ప్రముఖ్ ఆంధ్రూ జేవియర్ మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవులు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారంటూ ఊహాగానాలు వస్తున్నాయని, అందులో నిజం లేదన్నారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ క్రైస్తవులకు చేసిందేమి లేదని, ఇక బీజేపీ తమను పట్టించుకోకుండా కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన పదేండ్లలో ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని వర్గాల ప్రజలతో కలిసి శాంతియుతంగా జీవిస్తున్నామని చెప్పారు.

### బీఆర్ఎస్‌కే మా మద్దతు...

సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. దేశ చరిత్రలో క్రైస్తవులకు క్రిస్మస్ సందర్భంగా కానుకలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, పండుగను సైతం రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సూర్యాపేట, నిజామాబాద్ తదితర జిల్లాలో క్రైస్తవ భవనాలు కొన్నింటిని నిర్మించగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో యాదగిరిగుట్ట నిర్మాణంతో పాటు అనేక ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్, ఐటీ రంగం అభివృద్ధి ఇలా అభివృద్ధిలోనూ రాష్ట్రం అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో క్రైస్తవులందరూ సుఖ, శాంతులతో జీవిస్తున్నారని, అలాంటి తరుణంలో బీఆర్ఎస్‌కే అండగా నిలబడటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు క్రైస్తవులందరూ ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తమిళ క్రైస్తవ సంఘం నాయకులు మోజెస్ దాస్, మల్కాజిగిరి క్రిస్టియన్ కమ్యూనిటీ అధ్యక్షుడు కొర్ని లియాస్, ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్ అధ్యక్షుడు మెల్విన్ బెనిడిక్ట్, పాల్ సంపత్ కుమార్, రేమండ్, సురేశ్, ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కే మద్దతు

చిక్కడపల్లి, నవంబర్ 25: స్వామి వివేకానంద సొసైటీ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొడిమల మహేందర్ కుమార్ తెలిపారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను కలిసి మద్దతు తెలుపుతూ తీర్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, గడిచిన 9 సంత్సరాల బీఆర్ఎస్ పాలనను చూస్తే అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థ ప్రతినిధులు ఉన్నారని, బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు.



మంత్రి కేటీఆర్‌కు తీర్మాన పత్రం అందజేస్తున్న మహేందర్ కుమార్

## గోషామహల్‌లో విజయం సాధిస్తాం



మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా

అబిడ్స్, నవంబర్ 25 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు దోహదపడతాయని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్‌గుప్తా మాట్లాడుతూ... నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు ఉందని, వారి మద్దతుతో పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రజల సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో నందకిశోర్ వ్యాస్ భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి



రోడ్ షోలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్ గౌడ్

- ప్రతిపక్షాల మాయ మాటలు నమ్మొద్దు
- రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్ గౌడ్

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 25 : సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్ గౌడ్ అన్నారు. శనివారం సులేమాన్ నగర్ , శాస్త్రీపురం డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుల, మతాల మధ్య తారతమ్యం లేకుండా మంచి పాలన సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో అనేక మార్పులు తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందామని గుర్తు చేశారు. సీసీ రోడ్లు, ఇంటింటికీ తాగునీరు, నిరంతర విద్యుత్, డ్రైనేజీలతో పాటు, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ , డబుల్ బెడ్రూమ్‌లు , తదితర అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయితే మరిన్ని పథకాలు అమలు చేస్తారని తెలిపారు. రూ.400 గ్యాస్ సిలిండర్, మహిళలకు సౌభాగ్యలక్ష్మి, జీవిత బీమా, రేషన్ పై సన్న బియ్యం తదితర పథకాలను ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చెప్పారు. డివిజన్‌లోని సులేమాన్ నగర్, బిలాల్ హోటల్, ఎం.ఎం పహాడీ దర్గ, చింతల్‌మెట్ తదితర కాలనీల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, సయ్యద్, వషీమ్, షేక్ సమీర్, వాజీద్, సురేశ్, నవీన్ కుమార్, సనా, సైనాజ్, భానూ , నషీన్, సలీమా, ఫర్జానా, రషీద, తదితరులు పాల్గొన్నారు.

## 28 సాయంత్రం నుంచి అంతా గప్‌చుప్

### ఎల్లుండి నుంచి ప్రచారం బంద్

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమరంలో పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. రాత్రి పదయ్యే వరకు అంతటా మైకుల రాజ్యమే నడుస్తోంది. సభలు, ప్రచారాల్లో నినాదాలు ఆకాశన్నంటుతున్నాయి. దీనికి తోడు అన్ని పార్టీల ప్రచార రథాలు గల్లీ గల్లీలో రెండుకు మించి తిరుగుతున్నాయి. తీరొక్క పాటలతో తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాయి. మొత్తంగా గ్రేటర్‌లో ఎక్కడ చూసిన ప్రచార సందడే కనిపిస్తున్నది. అయితే మరో రెండు రోజుల్లో ఈ మైకులకు ఎన్నికల కమిషన్ ఫుల్‌స్టాప్ పెట్టనుంది. ఈ నెల 28వ తేదీ సాయంత్రం ప్రచారం ముగియనుంది. దీంతో అభ్యర్థులకు రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో తమ తమ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తమ పార్టీ అగ్ర నేతలతో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ప్రచార రోజులన్నీ అటు ప్రజలకు కలిసొచ్చాయి. పార్టీల ప్రచారానికి జనం అవసరం ఉండటంతో తలకో రేటు కట్టి ప్రచారం మొత్తం తిప్పుకుంటున్నారు. మొత్తంగా పార్టీల ప్రచారంతో సందడి తలపించిన చౌరస్తాలు, పార్టీ కార్యాలయాలు, రోడ్లు మరో రెండు రోజుల్లో బోసిపోనున్నాయి.

## మరోసారి ఆశీర్వదించండి

### కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ.వివేకానంద్



నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రచారం చేస్తున్న కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానంద్, మేయర్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులు

దుండిగల్, నవంబర్ 25: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్న తనను మరోసారి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కేపీ.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అశోకా-ఏ-మెన్షన్ విల్లాలో శనివారం ఆయన స్థానిక మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. నాయకుడు అనే వాడు ప్రతినిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సాదక, బాధలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల వేళ ఇక్కడ దర్శనమిచ్చి, ఆ తర్వాత వేరే ప్రాంతాల్లో ఉండే నేతలు ఏవిధంగా ప్రజలకు సేవ చేస్తారో ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే హడావిడి చేస్తూ అమలు కాని వాగ్ధానాలు చేస్తున్న ప్రతిపక్ష నేతల మాటలు నమ్మొద్దన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధిని చూసి తనను మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఈవీఎంలోని మూడో నంబర్‌లో ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## యాంటీ బయోటిక్స్‌ను డాక్టర్ సలహా మేరకే వాడాలి

### మైక్రో బయాలజీ విభాగాధిపతి మధురిమ

జూబ్లీహిల్స్, నవంబర్ 25: యాంటీ బయోటిక్స్‌ను డాక్టర్ల సలహా మేరకు మితంగా వాడాలని మైక్రో బయాలజీ విభాగాధిపతి బి.మధురిమ పేర్కొన్నారు. శనివారం వరల్డ్ యాంటీ మైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్‌ను పురస్కరించుకుని నిలోఫర్ దవాఖాన ఆవరణలో మైక్రోబయాలజీ విభాగాధిపతి బి.మధురిమ, సహచర్య అధిపతులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఉదయశ్రీ, డాక్టర్ శ్రీవిద్య, ఇతర వైద్యులు, సిబ్బందితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. యాంటీ బయోటిక్స్ అత్యధికంగా వినియోగిస్తే బాక్టీరియాలో రెసిస్టెన్స్ పెరిగి రానున్న తరాలలో ఆయా ఔషధాలు పనిచేయకుండా పోతాయన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు సెల్ఫీ డిజైన్లు, క్విజ్ పోటీలు, డాక్టర్ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

